పండగలా వ్యవసాయం

- ఆర్‌బీకేల ద్వారా రైతులకు సేవలు
- విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల విక్రయాలు
- ఆనందంలో అన్నదాతలు



రామవరప్పాడులోని రైతు భరోసా కేంద్రం



రామవరప్పాడు: ఆరుగాలం కష్టించి అందరికీ కడుపు నింపే అన్నదాతలంటే ఒకప్పుడు చిన్న చూపు ఉండేది. పైగా గత ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణితో పండించిన పంటకు గిట్టుబాటు ధర లేక, సకాలంలో విత్తనాలు అందక అన్నదాతలు కడుపుకోతకు గురయ్యారు. రైతుల కష్టాలను ఎన్నికలకు ముందు పాదయాత్రలో దగ్గర నుంచి చూసిన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చలించిపోయారు. వ్యవసాయాన్ని పండుగలా మార్చాలనే తలంపుతో అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి రైతాంగ అభివృద్ధికి కృషి చేస్తున్నారు. రైతే రాజు అనే నినాదంతో రైతుల సంక్షేమం కోసం రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసి విప్లవాత్మకమైన మార్పులకు శ్రీకారం చుట్టారు. విజయవాడ రూరల్ మండలంలో గ్రామ గ్రామాన రైతు భరోసా కేంద్రాలను నెలకొల్పారు. తద్వారా రైతులకు ఏ అవసరం వచ్చిన ఆర్బీకేల ద్వారా సేవలు అందిస్తూ రైతు నేస్తాలుగా పేరుగాంచాయి. ప్రతి రైతు తాము సాగు చేసిన పంటలకు సంబంధించి ఈ క్రాప్ బుకింగ్ చేసుకుంటున్నారు. తద్వారా విపత్తులు, తుఫాన్ల సమయంలో పంటలు నష్టపోతే ప్రభుత్వం నష్టపరిహారం అందిస్తుంది.

మండలంలో 19 ఆర్బీకేలు

విజయవాడరూరల్ మండలంలో 14 గ్రామాలున్నాయి. శివారు గ్రామాలతో కలిపి మండలం మొత్తం 19 ఆర్బీకే సెంటర్లు రైతులకు సేవలందిస్తూ ముందంజలో ఉన్నాయి. గతంలో రైతులకు ఏ అవసరం వచ్చినా మండల కేంద్రంలో ఉండే వ్యవసాయ శాఖ కార్యాలయానికి వెళ్లాల్సి వచ్చేది. ప్రస్తుతం ఆ ఇబ్బందులు రాకుండా ఉన్న గ్రామంలోనే ఆర్బీకే సెంటర్ల ద్వారా అన్నీ సేవలను అందిస్తున్నారు. భూసార పరీక్షలు, సేంద్రీయ ఎరువుల వాడకంపై


రైతులకు గన్నీ బ్యాగులు అందజేస్తున్న సివిల్‌సప్లై ఎండీ వీరపాండ్యన్, జేసీ నూపుర్ అజయ్ (ఫైల్)

అవగాహన, బ్యాంకుల ద్వారా రైతులకు రుణాలు, వ్యవసాయ అవగాహన సదస్సులు నిర్వహించి రైతాంగ అభివృద్ధికి విశేష కృషి చేస్తున్నారు.

వ్యవసాయ యంత్రాల పంపిణీ

వ్యవసాయంలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చేందుకై ఆధునిక వ్యవసాయ యంత్ర పరికరాలను రైతు గ్రూపులకు అందజేస్తున్నారు. మండలంలో మొత్తం 14 ట్రాక్టర్లు, 60కు పైగా స్ప్రెయర్లు, రోటోవేటర్లు 10, సీడ్ డ్రిల్-3 పరికాలను ఇప్పటికే అందజేశారు. పలువురు రైతులకు సబ్సిడీలపై యంత్ర పరికరాలు అందించేందుకు సన్నహాలు చేస్తున్నారు. ఆర్బీకేల ద్వారా సబ్సిడీపై ఎరువులు, విత్తనాలు అందజేస్తున్నారు. పండిన పంటలు ఎత్తుకునేందుకు గన్నీ బ్యాగులు అందజేస్తున్నారు. హమాలీ చార్జీలను కూడా అందిస్తూ వ్యవసాయాన్ని మరింతగా ప్రోత్సహిస్తున్నారు.

ప్రభుత్వ సేవలు అభినందనీయం



వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో వ్యవసాయాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పండుగలా మార్చారు. గతంలో విత్తనాలకు ఇబ్బందులు పడేవాళ్లం. ప్రస్తుతం ఆర్బీకేలలో సబ్సిడీలపై విత్తనాలు, ఎరువులు ఇస్తున్నారు. రైతాంగ అభివృద్ధికి ఎన్నో పథకాలు ప్రవేశపెట్టి రైతన్నలను ఆదుకుంటున్న ప్రభుత్వ సేవలు అభినందనీయం.

బళ్లెం ప్రసాద్, రైతు

ఆర్‌బీకేలతో ఎంతో మేలు



ముఖ్యమంత్రి ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రాల ద్వారా గత నాలుగేళ్లగా రైతు భరోసా అందుతుంది. ముఖ్యంగా పంటల సాగుకు రైతు భరోసా డబ్బు ఎంతో ఉపయోగపడుతుంది. అన్నీ రకాల ఎరువులు, విత్తనాలు సబ్సిడీపై ఇస్తున్నారు.

కాట్రగడ్డ ఉమామహేశ్వరరావు, రైతు

నిధులు రికవరీ చేయలేదని కలెక్టర్‌కు ఫిర్యాదు

పెనమలూరు: పెదపులిపాక గ్రామ పంచాయతీలో గత ప్రభుత్వ పాలనలో జరిగిన నిధుల దుర్వినియోగానికి సంబంధించి ఇప్పటివరకు సొమ్ము రికవరీ చేయలేదని గ్రామ సర్పంచ్, వైఎస్సార్ సీపీ నేత గుంటూరు శ్రీనివాసచౌదరి జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సర్పంచి శ్రీనివాస చౌదరి బుధవారం వివరాలు తెలుపుతూ పెదపులిపాక గ్రామ పంచాయతీలో గతంలో ఈవోలుగా పనిచేసిన బి.సోమయ్య, టి.భారతిల హయాంలో గ్రామ పంచాయతీ నిధులు రూ.9,29,794 దుర్వినియోగం జరిగాయన్నారు. ఏడీఆర్ రిజిస్టర్‌లో ఇందుకు సంబంధించిన వివరాలు ఉన్నాయన్నారు. నిధుల రికవరీ గురించి జిల్లా పంచాయతీ అధికారి, డివిజనల్ పంచాయతీ అధికారిని అడిగినా స్పందించలేదన్నారు. దీనిపై జిల్లా కలెక్టర్ స్పందించి చర్యలు తీసుకోవాలని సర్పంచి శ్రీనివాసచౌదరి కోరారు.

లోతట్టు ప్రాంతాల్లో ముందస్తు చర్యలు

హనుమాన్‌జంక్షన్‌రూరల్: వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని గ్రామంలోని లోతట్టు ప్రాంతాల్లో ప్రజలు ఇబ్బందులు పడకుండా ముందస్తు చర్యలు చేపట్టామని బాపులపాడు సర్పంచ్ సరిపల్లి కమలాభాయి, పంచాయతీ కార్యదర్శి ప్రసాద్ తెలిపారు. హనుమాన్ నగర్‌లో పారిశుద్ధ్య పనులను బుధవారం పరిశీలించారు. అంతర్గత రోడ్లు వర్షకాలంలో బురదమయం కావటం, వర్షపు నీళ్లు ఇళ్లలోకి రావటంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతుండటంతో గ్రావెల్ రోడ్లుగా అభివృద్ధి చేస్తున్నట్లు సర్పంచ్ తెలిపారు. డ్రైనేజీల్లో మురుగు తీత పనులు కూడా చేపట్టినట్లు చెప్పారు. రైల్వేస్టేషన్, మహాత్మగాంధీ నగర్, తారక రామ కాలనీ, వేలేరు రోడ్డు, ఐటీఐ రోడ్డు ఏరియాల్లోనూ డ్రైనేజీ ప్రక్షాళనకు పారిశుద్ధ్య పనులు చేపడతామని తెలిపారు. ఎంపీటీసీ సభ్యురాలు మత్తి లక్ష్మీ మాధవి, వార్డు సభ్యులు పంజుగల సీత, తాడిశెట్టి శ్రీను, వైఎస్సార్ సీపీ నాయకులు కిరణ్‌మూర్తి, నాగరాజు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వలంటీర్ సేవలకు ప్రశంసలు



గన్నవరం రూరల్: వలంటీర్ సేవలను పలువురు ప్రశంసించారు. మండలంలోని కొండపావులూరు సచివాలయంలో వలంటీర్‌గా సేవలందిస్తున్న గజగంటి ఉదయభాను హైదరాబాద్ వెళ్లి బుధవారం లబ్ధిదారు ముప్పానేని లక్ష్మీకాంతమ్మకు బుధవారం పింఛను అందజేశారు. అనారోగ్య సమస్యలతో అక్కడ చికిత్స పొందుతున్న ఆమెకు పింఛను అందజేయటంతో సర్పంచ్ ఉప్పుగంటి పద్మజ, వైఎస్సార్ సీపీ నాయకులు ఉప్పుగంటి రాజేష్, ఓబిళనేని బ్రహ్మయ్య, పంచాయతీ కార్యదర్శి శ్రీను, గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

కానూరులో కోడి రామ్మూర్తి జయంతి

పెనమలూరు: కానూరులో బుధవారం ఉక్కు మనిషి కోడి రామ్మూర్తినాయుడు జయంతి ఘనంగా నిర్వహించారు. కానూరు అశోక్ జిమ్‌లో జిల్లా బాడీబిల్డింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు ఈదా రాజేష్, కార్యదర్శి తాళ్లూరి అశోక్ ఆధ్వర్యంలో కోడి రామూర్తినాయుడు జయంతి కార్యక్రమం నిర్వహించి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో సీనియర్ వ్యాయామకారులు షాజిత్, శ్రీను, సీపీఓ పి.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

శ్మశానవాటికకు 23 సెంట్లు స్థలం కేటాయింపు

ఉయ్యూరు:మండలంలోని గండిగుంట శివారు ఆనందపురం ఎస్సీ శ్మశానవాటికకు జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు 23 సెంట్లు స్థలాన్ని కేటాయించారు. ఈ మేరకు లోకాయుక్తకు పంపిన నివేదికలో పేర్కొన్నట్లు సామాజిక కార్యకర్త జంపాన శ్రీనివాసగౌడ్ తెలిపారు. స్థానిక విలేకరులతో బుధవారం ఆయన మాట్లాడుతూ ఆనందపురం దళితవాడలో శ్మశానవాటిక లేక కాలువకట్టనే శ్మశానవాటికగా వినియోగిస్తూ పడుతున్న ఇబ్బందులపై లోకాయుక్తకు ఫిర్యాదు చేసి భూములు కేటాయించాలని కోరానన్నారు. ఫిర్యాదును విచారించిన లోకాయుక్త జస్టిస్ లక్ష్మణ్‌రెడ్డి సమస్యపై సమగ్ర నివేదిక అందజేసి పరిష్కార చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారన్నారు.

ఇంటర్ విద్యార్థికి ఆర్థికసాయం

ఉయ్యూరు: విద్యాభివృద్ధికి రోటరీ క్లబ్ ఎప్పుడూ ముందుంటుందని రోటరీ క్లబ్ అధ్యక్షుడు సీహెచ్ వెంకటేశ్వరరావు అన్నారు. రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక రోటరీ ఆడిటోరియంలో ఇంటర్ విద్యార్థిని వాసంతికి రూ.15 వేలు ఆర్థిక సాయాన్ని బుధవారం అందించారు. కేసీపీ జీఎం సీకే వసంతరావు, రోటరీ అసిస్టెంట్ గవర్నర్ సయ్యద్ అనీస్, కార్యదర్శి నాగసుబ్రమణ్యం, పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయం

ఉంగుటూరు:ప్రజా సంక్షేమమే ధ్యేయంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పని చేస్తుందని ఎంపీపీ వి.సరోజిని అన్నారు. మండలంలోని వెల్దిపాడు గ్రామ సచివాలయం వద్ద జగనన్న సురక్ష కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ తమ సమస్యలను పరిష్కరించేందుకు జగనన్న సురక్ష పథకాన్ని సద్వినియోగించుకోవాలని సూచించారు. అర్హత ఉండి ఇంకా సంక్షేమం అందనివారి కోసం ప్రభుత్వం జగనన్న సురక్ష క్యాంపులను నిర్వహిస్తుందని చెప్పారు. అనంతరం పలువురికి ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. మండల ప్రత్యేక అధికారి ఫణి ధూర్జటీ, ఎంపీడీవో శేషగిరిరావు, నాగవరప్పాడు, వెన్నూతల, తుట్టగుంట, వెల్దిపాడు గ్రామాల సర్పంచులు పెద నాగూర్, రామ్మోహన్‌రావు, కృష్ణారెడ్డి, నాగేశ్వరరావు, పాల్గొన్నారు.

కంటి వెలుగుతో దృష్టి లోపాల నివారణ

కంకిపాడు: డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమంలో దృష్టి లోపాల నివారణ సాధ్యమవుతుందని ఉప్పలూరు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సుందర్‌కుమార్ అన్నారు. పీహెచ్‌సీ ఆవరణలో డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమం బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఆప్తాలమిక్ ఆఫీసర్ రాజేష్‌కుమార్, ఏఎన్ఎం భవాని, ఆశ కార్యకర్తలు సీత, విజయనిర్మల, ఉదయశ్రీ, ప్రశాంతి పాల్గొన్నారు.

నేడు పోరంకిలో విద్యుత్ సరఫరా నిలుపుదల

పెనమలూరు: నేడు పోరంకి సెక్షన్ పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఈఈ (ఆపరేషన్స్) హరిబాబు తెలిపారు. ఆయన బుధవారం వివరాలు తెలుపుతూ గురువారం పోరంకి సెక్షన్‌లో ఉదయం 7 నుంచి 10 గంటల వరకూ విద్యుత్ లైన్లు మరమ్మతులు కారణంగా విద్యుత్ సరఫరా ఉండదన్నారు. దీని కారణంగా పెనమలూరు సెంటరు, రామాపురం కాలనీ, ప్రభునగర్, డొంక రోడ్డు, బందరు రోడ్డు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తామని, స్థానికులు సహకరించాలని కోరారు.

7న అధ్యయన బృందం రాక

విజయవాడరూరల్: డ్వాక్రా గ్రూపు మహిళలు ఆర్థికంగా బలోపేతం కావడానికి మండలంలో వారు నిర్వహిస్తున్న యూనిట్లను అధ్యయనం చేసేందుకు ఈ నెల7వ తేదీన ఒడిశా నుంచి అధికారుల బృందం వస్తున్నట్టు వెలుగు ఏపీఎం చంద్రశేఖర్ తెలిపారు.

అంకితభావంతో పనిచేస్తే గుర్తింపు

రామవరప్పాడు: ఏ రంగంలోనైనా అంకిత భావంతో పని చేసినే గుర్తింపు లభిస్తుందని గన్నవరం ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ అన్నారు. విజయవాడ రూరల్ మండలం శ్రీ వెంకమ్మ పేరంటాలమ్మ ఆలయ నూతన ధర్మకర్తల మండలి సభ్యుల ప్రమాణ స్వీకారం బుధవారం నిర్వహించారు. తొలుత చైర్మన్‌గా ఎన్నికైన బోయిన భాను ప్రదీప్ ఇంటి నుంచి వైఎస్సార్ సీపీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, ధర్మకర్తల మండలి సభ్యులు ర్యాలీగా అమ్మవారి ఆలయానికి చేరుకున్నారు. ఈ కార్యక్రమానికి హాజరైన వంశీ నూతన పాలవకర్గ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోనే పేరంటాలమ్మ ఆలయానికి విశిష్టస్థానం ఉందన్నారు. భక్తుల మనోభావాలను గౌరవిస్తూ ఆలయ అభివృద్ధికి కృషి చేయాలని నూతన పాలకవర్గానికి సూచించారు. ఆలయ చైర్మన్‌గా ఎన్నికైన బోయిన భాను ప్రదీప్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో వరుసగా రెండోసారి చైర్మన్‌గా పదవీ బాధ్యలు అప్పగించినందుకు ఎమ్మెల్యే వంశీమోహన్, మాజీ ఎఎంసీ చైర్మన్ కొమ్మా కోట్లుకు కృతజ్ఞతలు తెలిపారు. ధర్మకర్తల మండలి సభ్యులు, ఇరు గ్రామాల పెద్దల సహకారంతో గత రెండు సంవత్సరాలు ఆలయ అభివృద్ధికి కృషి చేసినట్లు తెలిపారు. ప్రతి సంవత్సరం ఆనవాయితీగా అత్యంత ఘనంగా నిర్వహించే సంక్రాంతి, దసరా పండుగలతో పాటు పలు కార్యక్రమాలు దిగ్విజయంగా నిర్వహించేందుకు కృషి చేస్తానన్నారు. ఆలయ అభివృద్ధికి భక్తులు, పెద్దలు, దాతలు సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో


నూతన ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న ఎమ్మెల్యే వంశీ

గౌడ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ మాదు శివరామకృష్ణ, గొల్లపూడి మార్కెట్‌యార్డ్ మాజీ చైర్మన్ కొమ్మా కోట్లు, ఆలయ కార్యనిర్వహణాధికారి పి. లోకేశ్వరి, జెడ్పీటీసీ సువర్ణరాజు, వైఎస్సార్‌సీపీ గ్రామ కన్వీనర్ సమ్మెట సాంబశివరావు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఆర్. వెంకటేశ్వరరావు, రామవరప్పాడు, ఎనికేపాడు, నిడమానూరు సర్పంచ్‌లు వరి శ్రీదేవి, రాచమళ్ల పూర్ణచంద్రరావు, శీలం రంగారావు పలు గ్రామాల ఎంపీటీసీ, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

నూతన ధర్మకర్తల మండలి సభ్యులు వీరే...

ఆలయ నూతన చైర్మన్‌గా బోయిన భానుప్రదీప్, ధర్మకర్తల మండలి సభ్యులు మత్తె కిరణ్‌కుమార్, దొండపాటి అచ్చుతరావు, అంగిరేకుల సునీత, శిఖాకొల్లి యల్లమందయ్య, మాచెర్ల అరుణకుమారి, వేమినేని రజిత, ఉప్పు శివలీల, కాకాని ప్రశాంతిలు తమ విధులు సక్రమంగా నిర్వహిస్తామని ప్రమాణం చేశారు.

కాంట్రాక్టు కార్మికులను క్రమబద్ధీకరించండి

పెనమలూరు: పూర్వ కానూరు గ్రామ పంచాయతీలో కాంట్రాక్టు కార్మికులుగా పనిచేసి ప్రసుత్తం తాడిగడప మున్సిపాలిటీలో పనిచేస్తున్న 51 మంది కాంట్రాక్టు కార్మికులను క్రమబద్ధీకరణ చేయాలని కార్మిక సంఘ గౌరవ అధ్యక్షుడు వైఎస్సార్ సీపీ నేత అన్నే వేణుగోపాలకృష్ణమూర్తి విజ్ఞప్తిచేశారు. ఈ మేరకు బుధవారం మున్సిపల్ కమిషనర్ ఎస్.ప్రకాశరావుకు వినతిపత్రం అందజేశారు. కానూరు గ్రామ పంచాయతీలో 2006-2007 వ సంవత్సరం నుంచి 51 మంది కార్మికులు కాంట్రాక్టు పద్ధతిలో పని చేస్తున్నారని, 2011లో కార్మికులను తొలగించే యత్నం జరగ్గా కార్మికులు న్యాయ స్థానాన్ని ఆశ్రయించారన్నారు. కానూరు గ్రామ పంచాయతీని మున్సిపాలిటీలో విలీనం చేసిన తరువాత కూడా కార్మికులు అవుట్ సోర్సింగ్ విధులు నిర్వహిస్తున్నారని అన్నారు. ప్రభుత్వం 2014 సంవత్సరానికి ముందు 5 సంవత్సరాలు సర్వీసు చేసిన వారికి క్రమబద్ధీకరించాలని ఆదేశాలు ఇచ్చినందున కానూరులో పనిచేసిన 51 మంది కార్మికులను క్రమబద్ధీకరించాలని కోరారు.

పేద, మధ్య తరగతి కుటుంబాలకు జగనన్న సురక్ష


గోసాలలో సర్టిఫికెట్ అందజేస్తున్న సర్పంచి సంగెపు శ్రీనివాసరావు, అధికారులు


సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎంపీపీ అనగాని రవి, నాయకులు, అధికారులు

పెనమలూరు: పేద మధ్య తరగతి కుటుంబాలకు జగనన్న సురక్ష ఎంతో మేలు చేస్తుందని గోసాల గ్రామ పంచాయతీ సర్పంచి సంగెపు శ్రీనివాసరావు అన్నారు. గ్రామంలో బుధవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. సర్పంచి శ్రీనివాసరావు మాట్లాడుతూ గతంలో ప్రజలు సమస్యల పరిష్కారానికి ప్రభుత్వ కార్యాలయల చుట్టూ తిరిగేవారన్నారు. అయితే జగనన్న సీఎం అయిన తరువాత ప్రభుత్వ పాలన అన్ని వర్గాల ప్రజలకు చేరువగా వచ్చిందన్నారు. ఈ సందర్భంగా 145 మందికి వివిధ రకాల సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సునీతాశర్మ, తహసీల్దార్ వెంకటశివయ్య, డీఎల్‌డీఓ నాంచారరావు, ఈవోపీఆర్డీ కోరా శ్రీనివాసరావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉయ్యూరులో జగనన్న సురక్ష

ఉయ్యూరు: మండలంలోని బోళ్లపాడు సచివాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమం బుధవారం నిర్వహించారు. గ్రామంలో 184 మంది లబ్ధిదారులకు 11 రకాల సేవలకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలు అందించారు. మండల ప్రత్యేకాధికారి, జిల్లా ఉద్యానశాఖ అధికారి జె.జ్యోతి జగనన్న సురక్ష కార్యక్రమంపై అవగాహన కల్పించారు. సర్పంచ్ తుమ్మూరు సురేష్‌రెడ్డి, ఎంపీటీసీ తుమ్మూరు గంగారత్నం, తహసీల్దార్ మస్తాన్, ఎంపీడీఓ విమాదేవి పాల్గొన్నారు. ఉయ్యూరు పట్టణంలోని 3, 6 సచివాలయాల పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ (నాని), కమిషనర్ పాయసం వెంకటేశ్వరరావు 161 మంది లబ్ధిదారులకు 11 రకాల ధ్రువీకరణ పత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ సోలే సురేష్‌బాబు, కౌన్సిలర్లు తెనాలి పద్మావతి, గోన మదన్ తదితరులు పాల్గొన్నారు.

పారదర్శక సేవలకు నిదర్శనం జగనన్న సురక్ష

గన్నవరం రూరల్: మండలంలోని చిక్కవరం, చిన అవుటపల్లి గ్రామాల్లో సచివాలయాల వద్ద బుధవారం జగనన్న సురక్షా క్యాంపులు నిర్వహించారు. చిక్కవరం సచివాలయం వద్ద జరిగిన సభలో ఎంపీపీ అనగాని రవి మాట్లాడుతూ గ్రామంలో 628 మందికి ఒకే రోజు వివిధ రకాల సర్టిఫికెట్లను అందజేయటం చరిత్రాత్మకమని చెప్పారు. ప్రజలందరు ప్రభుత్వ సేవలతో సంతోషంగా ఉన్నారని తెలిపారు. ఎంపీడీవో సత్యకుమార్ అధ్యక్షతన జరిగిన సభలో జిల్లా పరిషత్ కో-ఆప్షన్ సభ్యుడు ఎండీ గౌసాని, సర్పంచ్ అన్నే లక్ష్మణరావు, సొసైటీ అధ్యక్షుడు బోయపాటి మురళీకృష్ణ, ప్రత్యేకాధికారి దుర్గా ప్రసాద్, ఎంపీటీసీ సభ్యులు మోరం నాగరాణి, చిలకపాటి దుర్గ, వైఎస్సార్‌సీపీ జిల్లా బీసీ విభాగం కార్యదర్శి సామల ఆంజనేయులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

పెనమలూరు: యనమలకుదురులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి గాయాలు అవటంతో పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. గ్రామంలో డొంకరోడ్డు నేతాజీ వీధిలో ఉంటూ కూలి పనులు చేసుకునే ఎం.కృష్ణ మంగళవారం ఉదయం టీ తాగటానికి ఇంటి వద్ద నుంచి డొంక రోడ్డులోకి రాగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టి ఆగకుండా వెళ్లింది. స్థానికుల సమాచారంతో 108 వాహనం సిబ్బంది అతనిని విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో చేర్చారు. బాధితుడి కుమారుడు రత్నప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

పైప్‌లైన్ పనులు చేస్తున్న వ్యక్తులపై దాడి

పెనమలూరు: యనమలకుదురులో మున్సిపాలిటీ పైప్‌లైన్ పనులు చేస్తున్న ముగ్గురు వ్యక్తులపై ఇద్దరు వ్యక్తులు కర్రలతో దాడి చేయటంతో పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ ఎం.కిషోర్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం యనమలకుదురు గౌడ రామాలయం వద్ద విజయవాడ రాజీవ్‌నగర్‌కు చెందిన గుంజా సైదులు మంగళవారం తాడిగడప మున్సిపాలిటీకి చెందిన పైప్‌లైన్ పనులు చేస్తుండగా మున్సిపల్ ఉద్యోగులు రాధాకృష్ణ, వెంకటకృష్ణారావు పనులు పర్యవేక్షిస్తున్నారు. అదే సమయంలో గ్రామానికి చెందిన సయ్యద్ బాషా, సాయి అనే వ్యక్తులు వచ్చి పైప్‌లైన్ పనులను అడ్డుకుని పనులు చేస్తున్న ముగ్గురిపై కర్రలతో దాడి చేశారు. ఈ ఘటనపై సైదులు పోలీసులకు ఫిర్యాదు చేయటంతో దాడి చేసిన ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేశారు.

యూనిట్లు ఏర్పాటు చేయాలి



ఉంగుటూరు:వ్యవసాయ పట్టభద్రులు అగ్రి క్లినిక్, అగ్రి బిజినెస్ కోర్సు పూర్తి చేసినవారు రైతులకు ఉపయోగపడే యూనిట్లు నెలకొల్పాలని నాబార్డు డీడీఎం, కృష్ణా ఎల్‌డీఎం జయవర్ధన్ సూచించారు. మండలంలోని ఆత్కూరు స్వర్ణభారత్ ట్రస్ట్‌లో ఎలీప్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహిస్తు అగ్రి బిజినెస్, అగ్రి క్లినిక్ శిక్షణ తరగతులు బుధవారం ముగిశాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొని శిక్షణ పూర్తి చేసిన వారికి పలు సూచనలు చేశారు. బ్యాంకు రుణం ఏవిధంగా పొందాలో చెప్పారు. ట్రస్ట్ డైరెక్టర్ పరదేశి మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో కూలీల కొరత వలన రైతు ఇబ్బంది పడకుండా ఉండే విధంగా ప్రతి గ్రామంలో కస్టమ్ హైరింగ్ సెంటర్‌లు ఏర్పాటు చేయాలని తెలిపారు. అనంతరం విద్యార్థులకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో అగ్రిక్లినిక్, అగ్రిబిజినెస్ ట్రైనింగ్ సెంటర్ నోడల్ ఆఫీసర్ పి.శోభారాణి పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయండి

నున్న(విజయవాడరూరల్): జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని విజయవాడ సబ్ కలెక్టర్ అదితిసింగ్ అధికారులను ఆదేశించారు. నున్న గ్రామంలో 757 లేఅవుట్లో జరుగుతున్న గృహ నిర్మాణ పనులను సబ్‌కలెక్టర్ బుధవారం పరిశీలించారు. ఈ లేఅవుట్‌లో ఏయే గ్రామాల లబ్ధిదారులున్నారనే వివరాలను గృహ నిర్మాణ శాఖ ఏఈ రామకృష్ణారావును అడిగి తెలుసుకున్నారు. శ్లాబు స్టేజిలో వున్న గృహాల నిర్మాణాలు వెంటనే పూర్తయ్యేలా, ప్రారంభం కాని వాటిని ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యుత్ సదుపాయాన్ని కల్పించాలని లబ్ధిదారులు కోరగా, సంబంధిత అధికారులతో మాట్లాడి ఏర్పాటు చేస్తామని సబ్‌కలెక్టర్ అన్నారు. గృహాల పరిశీలనలో రూరల్ మండల తహసీల్దారు పి.జాహ్నవిరెడ్డి, ఎంపీడీఓ బీఎల్‌వీ శేషగిరిరావు, ఏఈ రామకృష్ణారావు, గ్రామ పంచాయతీ కార్యదర్శి జీటీవీ రమణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


నున్న లేఅవుట్ లో అధికారులతో మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ అదితిసింగ్

రైతులకు విధిగా విత్తనాల సరఫరా

రామవరప్పాడు: రైతులకు విధిగా విత్తనాలు సరఫరా చేస్తున్నామని ఏపీ సీడ్స్ జిల్లా మేనేజర్ అనిత అన్నారు. విజయవాడరూరల్ మండలం ప్రసాదంపాడులోని ఏపీ సీడ్స్ కార్యాలయాన్ని బుధవారం మండల వ్యవసాయాధికారి రంగనాథ్ బాబు సందర్శించారు. ఈ సందర్భంగా ఏపీ సీడ్స్‌లో సరఫరా చేస్తున్న 6 రకాలైన విత్తనాలను పరిశీలించారు. వరి విత్తనాలు, ఫౌండేషన్, సర్టిఫైడ్ విత్తనాల మొలక శాతాన్ని పరిశీలించారు. అనిత మాట్లాడుతూ రైతులకు విత్తనాలు సరఫరా చేసే ముందు మొలకశాతం పరిశీలిస్తామని తెలిపారు. ఏవో రంగనాథ్ బాబు మాట్లాడుతూ విత్తనాలు కొనుగోలు చేసినప్పుడు రశీదు, విత్తనట్యాగ్‌ను రైతులు భద్రపరుచుకోవాలని సూచించారు. అనంతరం వరి, పచ్చిరొట్ట విత్తనాల నాణ్యతను పరిశీలించేందుకై నమూనాలను సేకరించారు. ఈ కార్యక్రమంలో వీఏఏలు, సిబ్బంది పాల్గొన్నారు.


ఏపీ సీడ్స్ కార్యాలయంలో విత్తనాలు పరిశీలిస్తున్న ఏవో రంగనాథ్ బాబు, అనిత తదితరులు

ప్రజా ప్రభుత్వానికి బాసటగా నిలవాలి

ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి

కంకిపాడు: అన్ని వర్గాల ప్రజల సంక్షేమాన్ని కాంక్షిస్తూ పాలన సాగిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలోని ప్రజా ప్రభుత్వానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజానీకం బాసటగా నిలవాలని ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి అన్నారు. మండలంలోని వేల్పూరు గ్రామ సచివాలయం వద్ద బుధవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. గ్రామానికి చెందిన 462 మంది లబ్ధిదారులకు 11 రకాల సేవలకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఎంపీపీ రాజ్యలక్ష్మి మాట్లాడుతూ అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పథకాలు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం, సీఎం వైఎస్ జగన్ పాలన సాగిస్తున్నారన్నారు. రాజకీయాలకు తావులేకుండా పథకాలను అందిస్తున్న ప్రజా ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అన్నారు. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యతా క్రమంలో నిధులు మంజూరు చేస్తున్నారన్నారు. జగనన్న సురక్ష ద్వారా మెరుగైన ప్రజా సేవలు అందేలా ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో ముందుకు సాగితే ప్రజలకు సేవలు సమర్థంగా అందుతాయని వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ చెన్నుబోయిన శివనాగేంద్రమ్మ, ఇన్‌చార్జి ఎంపీడీఓ ఉదయ్‌భాస్కర్, తహసీల్దార్ ప్రసాద్, ఈఓఆర్డీ మైథిలి, ఈఓ వెంకటేశ్వరరావు, వీఆర్‌ఓ ప్రవీణ్, స్థానిక నాయకులు చెన్నుబోయిన సుబ్బారావు, మాజీ సర్పంచ్ చెన్నుబోయిన జయరాం, చెన్నూరి శివప్రసాద్, మల్లంపల్లి దుర్గాప్రసాద్, నందం శ్రీను, కొఠారి సాంబశివరావు, బొబ్బనపల్లి మునలయ్య తదితరులు పాల్గొన్నారు.


వేల్పూరు గ్రామసభలో ధ్రువీకరణ పత్రాలు అందిస్తున్న ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి, పక్కన అధికారులు

పోరంకిలో వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

పెనమలూరు: పోరంకి గ్రామంలో వ్యక్తి అదృశ్యంపై పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పోరంకి నారాయణపురం కాలనీలో మాకినేని రామారావు కుటుంబ సభ్యులతో ఉంటున్నారు. ఆయన కుమారుడు మాకినేని ప్రవీణ్ కుమార్ ఎనికేపాడులో ఒక ప్రైవేటు కంపెనీలో పని చేస్తున్నాడు. అయితే అతను గత కొద్దికాలంగా ఉద్యోగానికి వెళ్లకపోవటంతో ఇంట్లో కుటుంబ సభ్యులు మందలించారు. ఈ నేపథ్యంలో ప్రవీణ్‌కుమార్ గత నెల 27వ తేదీ రాత్రి ఇంటినుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. అతని కోసం కుటుంబ సభ్యులు బంధువులు, పలు ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ తెలియలేదు. దీంతో తండ్రి రామారావు ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

సనత్‌నగర్‌లో 1017 సర్టిఫికెట్లు జారీ

పెనమలూరు: కానూరు సనత్‌నగర్‌లో మంగళవారం జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో కానూరు సచివాలయం-4 లో రికార్డు స్థాయిలో 1017 సర్టిఫికెట్లు ఇచ్చినట్టు జగనన్న సచివాలయ క్లస్టర్ ఇన్‌చార్జ్ చాంద్‌బాషా బుధవారం తెలిపారు. సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు అందరూ పట్టుదలతో పనిచేశారని ఆయన వివరించారు.